# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 31-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

### ముఖ్యాంశాలు

- దేశ వారసత్వ ప్రదేశాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడంలో త్రివిధ దళాలు కట్టుబడి ఉన్నాయని భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి అన్నారు.
- గత 12 ఏళ్లలో భారత్ సాంకేతికతను అనుసరించే దేశాలలో అగ్రగామిగా ఎదిగిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.
- అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ వారసత్వ ప్రదేశాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణిలో ప్రసారమైన `మన్ కీ బాత్` కార్యక్రమం 134వ సంచికలో ఈరోజు ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడారు. వేసవిలో లభించే మామిడి పండ్ల గురించి ప్రస్తావించిన ప్రధాని.. వాటిని సాగు చేస్తున్న రైతుల కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇటీవల తాను చేసిన నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా చోళుల కాలం నాటి పురాతన రాగి ఫలకాలను ఆ దేశం భారత్‌కు తిరిగి అప్పగించినట్లు తెలిపారు.

(వాయిస్ 30 సెకన్లు)

జ్ఞాన భారతం అభియాన్ కింద ఛత్తీస్‌గఢ్‌లోని మల్హార్‌లో 6, 7 శతాబ్దాలకు చెందిన పాండువంశ మహర్షి బలార్జునుడికి సంబంధించిన మూడు అరుదైన రాగి ఫలకాలు కూడా లభించాయని తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఖగోళ శాస్త్ర క్లబ్‌లు రోజు రోజుకూ ప్రాచుర్యం పొందుతున్నాయని, వాటి కార్యకలాపాలు పెద్ద నగరాల నుంచి చిన్న పట్టణాల వరకు, పాఠశాలల నుంచి పార్కుల వరకు కనిపిస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడంలో త్రివిధ దళాలు కట్టుబడి ఉన్నాయని భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా ఆయన ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశ ప్రయోజనాలను పరిరక్షించడంలో సాయుధ దళాలు నిరంతరం వృత్తి నైపుణ్యాన్ని, నిర్ణయాత్మకత కార్యాచరణను ప్రదర్శిస్తున్నాయని చెప్పారు. త్రివిధ దళాలు దేశ సేవ కోసం పూర్తి అంకితభావంతో పని చేస్తాయని తాను హామీ ఇస్తూ..

(వాయిస్ 25 సెకన్లు)

భారత నావికాదళ నూతన అధిపతిగా అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి స్థానంలో నియమితులయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

గత 12 ఏళ్లలో భారత్ సాంకేతికతను అనుసరించే దేశాలలో అగ్రగామిగా ఎదిగిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దూరదర్శన్ న్యూస్‌తో ఈరోజు జరిగిన ఒక పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచ స్థాయిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలో భారతదేశం అధికంగా పాలుపంచుకుంటోందని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో భారత్ లో పెరుగుతున్న ప్రాబల్యాన్ని ప్రస్తావిస్తూ.. అంతరిక్షం, అణుశక్తి, క్వాంటం టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాలలో దేశం గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. ఈ రంగాలు సమిష్టిగా 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశానికి అవసరమైన శాస్త్రీయ, సాంకేతిక పునాదిని నిర్మిస్తున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకాదళం పాకిస్థాన్ నౌకాదళం మొత్తాన్ని ఓడరేవులకే పరిమితం చేసిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. లక్నోలోని `నౌసేన శౌర్య వాటిక` ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈరోజు ప్రసంగిస్తూ... ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌పై ఒత్తిడిని తీసుకురావడంలో నౌకాదళం కీలక పాత్ర పోషించిందన్నారు. భారత నౌకాదళం పూర్తి సన్నద్ధతతో అరేబియా సముద్రంలో మోహరించి.. శత్రువులపై నిరంతర పోరాటాన్ని కొనసాగించిందని, ఫలితంగా పాకిస్తాన్ నౌకాదళం మొత్తం దాని ఓడరేవులకే పరిమితమైందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత నౌకాదళం తన సంపూర్ణ పోరాట సంసిద్ధత, కార్యాచరణ పరిధి, నిరోధక సామర్థ్యాలను ప్రదర్శించిందని రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ఫిట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా `సండేస్ ఆన్ సైకిల్` కార్యక్రమం దేశవ్యాప్త ఉద్యమంగా ఎదిగిందని కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు. షిల్లాంగ్‌లోని ఈరోజు జరిగిన `ఫిట్ ఇండియా-సండేస్ ఆన్ సైకిల్` కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రతి ఆదివారం `సండేస్ ఆన్ సైకిల్` కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఇది ఉత్తమ వ్యాయామ పద్ధతులలో సైక్లింగ్ ఒకటి అని, ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడం, కాలుష్యాన్ని తగ్గించడం, ఇంధనాన్ని ఆదా చేయడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందన్నారు. తక్కువ దూరాలకు, రోజువారీ ప్రయాణాలకు సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవడం ఇంధన పరిరక్షణ దిశగా జరుగుతున్న జాతీయ ప్రయత్నాలకు దోహదపడుతుందని మన్సుఖ్ మాండవీయా చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫీల్డింగ్ ఎంచుకోగా... బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ 12 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

`పీఎం సూర్య ఘర్.. ముఫ్త్ బిజ్లీ యోజన` పథకం కింద ఈ నెల 29న దేశవ్యాప్తంగా 15 వేల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఒక్క రోజులోనే ఏర్పాటు చేసి భారత్ అతిపెద్ద రికార్డును సాధించిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఒకే రోజులో రికార్డు స్థాయిలో 4,700 రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్‌లను నమోదు చేయడం ద్వారా ఈ విజయానికి మహారాష్ట్ర ప్రధాన సహకారిగా నిలిచిందని సామాజిక మాధ్యమం పోస్టులో కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ ఘనతతో గుజరాత్ తర్వాత దేశంలో 6 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్‌ల మైలురాయిని దాటిన రెండవ రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని ఆయన వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం దేశ వ్యాప్తంగా పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనా కాలంలో వివిధ సంస్కరణల ద్వారా దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. `మన్ కీ బాత్` కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో వీక్షించిన అనంతరం ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా.. జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి, రైల్వే రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల స్వీకరణ వంటి చర్యలు చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇదివరకు దేశంలో 70 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు 150కి చేరుకుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేరళం, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లో రానున్న 4 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) పేర్కొంది.  అలాగే రేపు  ఒడిశా, కర్ణాటక, మధ్యప్రదేశ్,  ఈశాన్య రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీ, హర్యానా, చండీగఢ్‌లోని అక్కడక్కడా ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. రాబోయే రెండు రోజుల్లో రాజస్థాన్‌లోని అక్కడక్కడా ధూళి తుఫానులు సంభవిస్తాయని ఐఎండీ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =